
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 9 డిసెంబరు 2025



నిండుకుండలా నగిరి సమీపంలోని మల్లమ్మ చెరువు

ఇటు జలకళ అటు వెలవెల

- నీటి చుక్క లేని చెరువులు
- మరోవైపు అలుగు పారుతున్న కుంటలు
- ఇదేమి ప్రకృతి వైపరీత్యం, వర్షం ఎక్కడ పడితే అక్కడే
- కనిపించని మొంథా, దిత్వా తుఫాన్ ప్రభావం



నరసారెడ్డిగారిపల్లె వద్ద అలుగు పారుతున్న మొక్కరోనికుంట

రాయచోటి (నేతాజీసర్కిల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదేమి ప్రకృతి వైపరిత్యమో.. ఒకవైపు చెరువులు, కుంటల్లో జలకళ సంతరించుకోగా.. మరోవైపు చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. రాయచోటి నియోజకవర్గంలో తుఫాను ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఎక్కడ వర్షం పడితే అక్కడే కొన్ని చోట్ల వర్షపు నీటితో చెరువులు నిండుకుండను తలపిస్తూ మొరవలు పారుతున్నాయి. మరికొన్ని చోట్ల చుక్కనీరు లేక చెరువులు వెలవెలబోతున్నాయి. ఇలాంటి పరిస్థితులు రాయచోటి నియోజకవర్గంలో దర్శనమిస్తున్నాయి. రాయలసీమలోనే అత్యంత కరువు పీడిత ప్రాంతం రాయచోటి. ఇక్కడ రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. నాలుగైదు సంవత్సరాలుగా రైతులను వర్షాభావ పరిస్థితులు పట్టి పీడిస్తున్నాయని. భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ బావులు, బోర్లలో చుక్కనీరు రాని పరిస్థితులు ఉన్నాయి.

సంబేపల్లె మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలకు తూర్పు వైపున ఉన్న గ్రామాలు శెట్టిపల్లె, దుద్యాల, గురిగింజకుంట, గున్నికుంట్ల ప్రాంతాల్లో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుని ఉన్నాయి. పడమటి వైపు ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికీ నారాయణరెడ్డిపల్లె, మోటకట్ల, ప్రకాశ్‌నగర్ కాలనీ, రౌతుకుంట, సంబేపల్లెల్లో చుక్కనీరు లేని చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇక్కడ రైతులకు వ్యవసాయమే జీవనాధానం. వర్షాలపై ఆధారపడి మెట్ట పొలాల్లో ప్రధానంగా వేరుశనగ పంట సాగు చేస్తారు. లక్షలు ఖర్చు పెట్టి బోర్లు వేసినా కొన్ని ప్రాంతాల్లో నీరు పడక నష్టపోయిన రైతులు ఉన్నారు.



సంబేపల్లె సమీపంలో చుక్క నీరు లేని గంగిరెడ్డి చెరువు

రైతులకు ఫలితాన్ని ఇవ్వని ప్రాజెక్టులు, జలాశయాలు

సంబేపల్లె మండల రైతులకు ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుగా చెప్పుకొనే ఝరికోన నుంచి ఒక ఎకరాకు కూడా సాగునీరు అందడం లేదు. దేవపట్ల, గుట్టపల్లి, సోమవరం ప్రాంతాల గుండా హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువలు ఉన్నా ఇప్పటి వరకు కాలువలు పూర్తి కాక రైతులకు ఎటువంటి సత్ఫలితాన్ని ఇవ్వడం లేదు. మండిపల్లి నాగిరెడ్డి జలాశయం ఉన్న ఈ ప్రాంతం నుంచి నారాయణరెడ్డిపల్లె, మోటకట్ల, పీఎన్ కాలనీ, గురిగింజకుంట, గున్నికుంట్ల, దుద్యాల ప్రాంతాల మీదుగా కాలువలు పెండింగ్‌లో ఉన్నాయి. హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువల ద్వారా మండిపల్లి నాగిరెడ్డి జలాశయం నింపాల్సి ఉంది. అయితే పెండింగ్‌లో ఉండడంతో ఈ జలాశయం ద్వారా రైతులకు ఒక ఎకరా సాగునీరు కూడా అందలేదు. ప్రాజెక్టులు ఉన్నా రైతులకు ప్రయోజనం లేదు.



చుక్క నీరు లేని ముదినేనివాండ్లపల్లెలోని లింగప్ప కుంట

నిండని కుంటలు, చెరువులు

సంబేపల్లె మండల వ్యాప్తంగా సుమారు వందకు పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. సుమారు ఇందులో 18 పెద్ద చెరువులు కలవు. శెట్టిపల్లి పెద్ద చెరువు, లాలాచెరువు, నేమిళ్లకుంట, శెట్టిపల్లె చిన్న చెరువు, ముక్కరోనికుంట చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. నారాయణరెడ్డిపల్లె గ్రామంలో లింగప్పకుంట, మోటకట్ల గ్రామంలో గంగిరెడ్డిచెరువు, లాభం చెరువుతో పాటు చాలా కుంటలు, చెరువులు ఒక చుక్కనీరు లేక మైదానాన్ని తలపిస్తున్నాయి.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు సమర్పించే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 130 ఫిర్యాదులు పీజీఆర్ఎస్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడారు. చట్టపరమైన పరిమితుల్లో నిర్ణీత గడువు లోపు వాటిని పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పోలీసుశాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో సోమవారం 26.232 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటికి వదులుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా.. వర్షకాలం తర్వాత భద్రతా చర్యల్లో భాగంగా ప్రాజెక్టు 14 గేట్లను సోమవారం ఇంజనీర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ప్రాజెక్టు గేట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం 14 గేట్లు సురక్షితంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు ఎస్ఈ కొండారెడ్డి, రిటైర్డ్ ఎస్ఈ లక్ష్మిరెడ్డి, ఈఈ ఉమామహేశ్వర్లు, డీఈ నారాయణరెడ్డి, జేఈ జ్ఞానేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాకే.. పనులు చేపట్టండి

- టెయిలింగ్‌పాండ్ వద్ద కేకే కొట్టాల గ్రామ ప్రజల నిరసన

7

కుక్కలు వెంటపడటంతో..
గోడను ఢీకొని యువకుడి మృతి

రాయచోటిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో వీధి కుక్కలు వెంటపడటంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు భయంతో వెనక్కి తిరిగి చూస్తూ ఆలయ గోడకు ఢీకొని దుర్మరణం చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున 2.50 గంటల సమయంలో జరిగింది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణం గాలివీడురోడ్డులో గల లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న ఫజిల్ (29) ఫర్నీచర్ దుకాణం పెట్టుకుని వ్యాపారం చేసుకునేవాడు. ఈ క్రమంలో కడప మార్గంలో ఉన్న దుకాణాన్ని ఇటీవలే చిత్తూరు రోడ్డులోకి మార్చి ఇక్కడ ఉన్న సామాన్లను ఆదివారం అర్ధరాత్రి దాటే వరకు తరలించారు. అనంతరం ద్విచక్రవాహనంపై లక్ష్మీపురంలోని తమ ఇంటికి వెళుతుండగా సరిగ్గా అర్బన్ పోలీస్ స్టేషన్ సమీపంలో కుక్కలు ద్విచక్రవాహనాన్ని వెంబడించాయి. దీంతో అతను కుక్కలు ఎక్కడ తనపై దాడి చేస్తాయో అన్న భయంతో వెనక్కి తిరిగి చూస్తూ వేగంగా వెళుతూ అక్కడున్న అమ్మవారి ఆలయ గోడకు ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఫజిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వీధి కుక్కలు వెంబడించడంతో ఆలయ గోడను ఢీకొని మృతిచెందిన ఫజిల్



ఫజిల్ ఫైల్‌ఫొటో

కుక్కల స్వైరవిహారం

రాయచోటి పట్టణంలో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇవి వాహనాలను వెంబడించడమే కాకుండా చిన్నారులపై, యువకులపై దాడిచేస్తూ గాయపరుస్తున్నాయి. ఇటీవల రాయచోటి మున్సిపాలిటీలో కొన్ని కుక్కలు సుమారు 15 మందిపై దాడికి పాల్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో చికెన్‌సెంటర్ నిర్వాహకులు అక్కడున్న వేస్టేజ్‌ని కుక్కలకు వేస్తుండడంతో ఆ ప్రాంతంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఆ దారిన వచ్చిపోయే చిన్నపిల్లలపైన, వాహనదారులపైన దాడికి దిగుతున్నాయి. ఏదేమైనప్పటికీ మున్సిపల్ అధికారులు వీధి కుక్కలను నియంత్రించకపోవడంతోనే ఒక యువకుడు మృత్యువాత పడ్డాడని వారి కుటుంబ సభ్యులతో పాటు పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి వీధి కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే కౌశల్

- డీఈవో షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను వెలికితీయడానికి కౌశల్ టాలెంట్ పరీక్షలు ఉపయోగపడుతున్నాయని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డీఈవో అభినందించారు. అనంతరం జిల్లా కోఆర్డినేటర్ విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ 103 పాఠశాలల నుంచి 1200 మంది రిజిస్ట్రేషన్ చేయగా, 980 మంది పాఠశాల స్థాయిలో, 120 మంది జిల్లా స్థాయిలో పరీక్షల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో 12 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విజేతలకు రూ.1500 మొదటి బహుమతి, రూ.1000 రెండో బహుమతి, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌశల్ జాయింట్ కోఆర్డినేటర్ సత్యమూర్తి, సైన్స్‌మ్యూజియం క్యూరేటర్ రెహ్మాన్, సర్ సివి రామన్ సైన్స్‌క్లబ్ ప్రతినిధులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో డీఈవో షంషుద్దీన్

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో షంషుద్దీన్ పిలుపునిచ్చారు. సోమవారం కడప నగరం విజయనగర్ కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వాళ్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు జి.విజయభాస్కర్‌రెడ్డి, సురేశ్‌కుమార్, అనిల్‌కుమార్, నాగ సురేశ్, జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. తమ పరిధిలో అందిన అర్జీలను తప్పకుండా పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, తప్పుడు డాక్యుమెంట్లను, ఫొటోలను అప్లోడ్ చేసినా, ఎండార్స్‌మెంట్ రిపోర్టులు ఇచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్లు వెంకటపతి, శిరీష, రంగస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఇద్దరు సస్పెన్షన్.. ఇద్దరికి చార్జిమెమో

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరి సస్పెన్షన్, మరో ఇద్దరికి చార్జి మెమోలు, ఒకరిపై చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. కడప కార్పొరేషన్ పరిధిలోని సరోజినీనగర్ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీతో పాటు సింహాద్రిపురం తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని సస్పెండ్ చేశారు. అలాగే సింహాద్రిపురం తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుకు, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల కార్యాలయం పరిధిలోని విలేజ్ సర్వేయర్‌కు చార్జ్ మెమోలు జారీ చేశారు. ఖాజీపేట మండలం ఎస్‌హెచ్‌ఓపై కూడా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

పోట్లదుర్తికి భారీగా తరలివచ్చిన నేతలు

ఎర్రగుంట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తల్లి రత్నమ్మ దశదినకర్మ సందర్భంగా పోట్లదుర్తి కి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున నేతలు వచ్చారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర హోం మంత్రి అనిత, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, అనగాని ప్రసాద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు రత్నమ్మ చిత్రపటానికి పూలువేసి నివాళుల ర్పించారు. ఉదయం దశదిన కర్మకు సంబంధించిన కార్యక్రమాన్ని వేదపండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. రత్నమ్మ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. సీఎం రమేశ్ తల్లిదండ్రుల పెళ్లిఫొటోలు, మరణించినంత వరకు ఉన్న జ్ఞాపకాలతో కూడిన ఫొటో ప్రదర్శనను వచ్చిన వారు ఆసక్తిగా తిలకించారు. సీఎం రమేశ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి, కాలువ శ్రీనివాసులు, జేసీ అస్మిత్‌రెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి, కందికుంట ప్రసాద్, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్, కేఎస్ఎన్ఎస్ రాజు, విజయకుమార్, బండారు శ్రావణి, ఎమ్మెల్సీ గ్రీష్మ, మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, ఎస్.రఘురామిరెడ్డి, ఏపీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, బీజేపీ నేతలు శశిభూషణ్‌రెడ్డి, దినకర్, దీపక్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, టీడీపీ నేతలు గోవర్దన్ రెడ్డి, హరిప్రసాద్, నంద్యాల కొండారెడ్డి, అమీర్‌బాబు, ఈవీ సుధాకర్‌రెడ్డి, జేసీ పవన్ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికా రులు ఉన్నారు. అలాగే అనకాపల్లి టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు తాతయ్యాబాబు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అనకాపల్లె పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజవర్గాల నుంచి భారీ ఎత్తున బస్సుల్లో, వాహనాల్లో తరలివచ్చారు. పోట్లదుర్తికి ప్రముఖులు రావడంతో డీఎస్పీ వెంకటేశ్వర రావు, సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నాగమురళి ఆధ్వర్యంలో బారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎర్ర గుంట్ల నుంచి దారిపొడవునా పోలీసులు నిఘా ఉంచారు.



ఎంపీ సీఎం రమేశ్ తల్లి రత్నమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు తదితరులు



ఎంపీ సీఎం రమేశ్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు తదితరులు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- తాతలనాటి భూములకు మోక్షం
- రూ.100లకే వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లు
- రైతులకు కూటమి సర్కారు తీపి కబురు



కడప కలెక్టరేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వారసత్వంగా వచ్చే తాతల కాలం నాటి భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరగాలంటే అసాధ్యంగా మారింది. ఏళ్ల తరబడి తమ అనుభవంలో భూములు ఉన్నప్పటికీ ఆర్థిక అవసరాలకు అమ్మేందుకు వీలుండేది కాదు. తాత బతికున్నప్పుడే కుటుంబ సభ్యులు సాదాబైనామా (తెల్ల కాగితాలు) పేరుతో ఒప్పంద భాగ పరిష్కారాలు జరిగేవి. కుటుంబంలో చిన్న చిన్న తగాదాలు, భాగ పరిష్కారాల్లో వ్యత్యాసాల వల్ల కలిసికట్టుగా రిజిస్ట్రేషన్లు చేసుకునే వారు కాదు. కాలక్రమేణ భూ యజమానియైన తాత గతించడంతో ఆ భూముల రిజిస్ట్రేషన్లు ప్రశ్నార్థకంగా మిగిలాయి. అంతేకాకుండా భూ యజమాని మరణానంతరం రెవెన్యూ రికార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు కాని కారణంగా రెవెన్యూలో సవాలక్ష ఆంక్షలు తప్పటం లేదు. ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్న కుటుంబాలు జిల్లాలో వేలాదిగా ఉన్నాయి. అలాంటి వారి మొర కూటమి సర్కారు ఆలకించింది. తాతల కాలం నాటి భూములకు సాదాబైనామా రాసుకుని ఉంటే సరైన ఆధారాలు చూపగలిగితే మార్కెట్ వ్యాల్యూ రూ.10 లక్షల లోపు ఉంటే కేవలం రూ.100, రూ.10 లక్షలు దాటితే రూ.1,000 ఫీజుతో రిజిస్ట్రేషన్లు చేసుకునేలా తాజాగా మంత్రి మండలి ఆమోదం తెలిపింది. విధి విధానాలతో నేడో రేపో అన్ని రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ కార్యాలయాలకు జీవో ప్రతులు చేరనున్నాయి.

వైసీపీ ప్రభుత్వంలో ఫీజుల మోతే..

వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు చేసుకోవాలంటే వైసీపీ పాలనలో రిజిస్ట్రేషన్ ఫీజుల మోత మోగేది. వారసత్వపు ఆస్తిలో కుటుంబ సభ్యుల్లో ఎక్కువ, తక్కువ భాగపరిష్కారాలు జరిగి ఉంటే.. ఎక్కువ ఆస్తిని పొందిన వారికి 3 శాతం ఫీజులు అదనంగా వసూలు చేసేవారు. ఉదాహరణకు రూ.15 లక్షల ఆస్తిలో పెద్ద కుమారుడికి రూ.10 లక్షలు, చిన్న కుమారుడికి రూ.5 లక్షల ఆస్తి ఉంటే అందులో రూ.10 లక్షల ఆస్తి ఉన్న అతనికి 3 శాతం స్టాంపు డ్యూటీ రూ.15వేలు, రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.2500లు చెల్లించాల్సిందే. మిగతా భూమి పొందిన చిన్న కొడుకు 1 శాతం స్టాంప్ డ్యూటీ అంటే రూ.5 వేలు, రిజిస్ట్రేషన్ రుసుం కింద రూ.1000 చెల్లించాల్సి ఉండేది. ఈ లెక్కన రూ.15 లక్షల ఆస్తికి అక్షరాల రూ.23,500 రిజిస్ట్రేషన్ల ఫీజుల భారం మోపేది. వారసత్వ భూముల సమస్యలకు తాము ఊరట కల్పిస్తున్నాం అన్నట్టుగా వైసీపీ ప్రభుత్వం ఆర్భాట ప్రచారాలు చేస్తూ 2021లో జీవో జారీ చేసి అడ్డగోలుగా వసూళ్లకు దిగింది.

గతంలో టీడీపీ హయాంలో...

2019కి ముందు టీడీపీ పాలనలో వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ల ఫీజులు చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఊరట కల్గించేవి. రూ.15 లక్షల విలువ గల ఆస్తిని ముగ్గురు అన్నదమ్ములు పంచుకుంటే అందులో రూ.5 లక్షలకు మినహాయింపు ఉండేది. కేవలం రూ.10 లక్షలకు మాత్రమే 1శాతం ఫీజుతో రూ.10 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకునే విధానం ఉండేది. జగన్ సర్కారు తెచ్చిన విధానాలతో పోల్చితే టీడీపీ పాలనలో రిజిస్ట్రేషన్ దారులకు రూ.13,500 వరకు మిగులేది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు మరింత భారం తగ్గనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు, మరోపక్క రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కుప్పకూలి రిజిస్ట్రేషన్లశాఖకు రాబడి తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇచ్చిన హామీల మేరకు ఆర్థిక భారం భరిస్తూ రూ.10 లక్షల లోపు విలువ గల భూములకు కేవలం రూ.100లు, రూ.10 లక్షలు పైబడితే రూ.1,000ల ఫీజు వసూలుకు కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమౌతోంది.

హంద్రీనీవా నీటితో చెరువుల్లో జలకళ

- సాగు, తాగునీటి ఎద్దడి లేనట్లే
- నాలుగు మండలాల్లో 13 చెరువులకు కృష్ణా జలాలు
- పెరుగుతున్న భూగర్భ జలాలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమను సస్యశ్యామలంగా మార్చేందుకు స్వర్గీయ ఎన్టీ రామారావు ప్రారంభించిన హంద్రీ-నీవా ప్రాజెక్టు ఎట్టకేలకు చంద్రబాబు చొరవతో సత్ఫలితాలు ఇస్తోంది. జిల్లాలోని నాలుగు మండలాల్లో హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలు 13 చెరువులకు చేరుతున్నాయి. ఈ చెరువుల నుంచి సాగునీటితో పాటు, భూగర్భ జలాలు పైకి ఎగబాకుతూ బోర్లలో తాగునీటి సమస్య తీరుతోంది.

నాలుగు మండలాలకు వరం

జిల్లాలో పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట, మదనపల్లె మండలాల గుండా హంద్రీ-నీవా ప్రాజెక్టు సాగుతోంది. సుమారు 70 కిలోమీటర్ల పొడవునా పారుతున్న హంద్రీ-నీవా జలాలు ఈ నాలుగు మండలాల ప్రజలకు ఒక వరంలా మారాయి. హంద్రీ-నీవా నీటితో ఈ నాలుగు మండలాల్లో 13 వరకు చెరువులకు కృష్ణా జలాలు చేరుతుండగా, మరికొన్ని చెరువులకు కృష్ణా జలాలు మళ్లించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సమాలోచనలు చేస్తున్నారు. పీటీఎం మండలంలో జిల్లాలోకి ప్రవేశించే హంద్రీ-నీవా కాలువ నుంచి తొలుత పీటీఎం పెద్ద చెరువుకు నీటిని వదులుతున్నారు. అలాగే రంగసముద్రం చెరువుకు కూడా కృష్ణా జలాలను వదులుతున్నారు. ఇప్పటి వరకు పీటీఎం పెద్దచెరువు, రంగసముద్రం చెరువు సగానికి పైగా నిండాయి. బి.కొత్తకోట మండలం గుండ్లపల్లె వద్ద ఇటీవల హంద్రీ-నీవా కాలువ తెగిపోవడంతో దిగువన ఉన్న గుండ్లపల్లె చెరువు హంద్రీ-నీవా నీటితో నిండిపోయింది. కురబలకోట మండలంలో చింతయ్యగారికోట వద్ద హంద్రీ-నీవా కాలువకు ఎయిర్‌బబుల్స్ లేకుండా చేయడానికి హంద్రీ-నీవా కట్టకు ఏర్పాటు చేసిన 3 ఇంచీల పైపు ద్వారా కొద్దికొద్దిగా నీరు కిందికి వస్తోంది. ఈ నీటితో రంగమ్మచెరువు నిండిపోయింది. ఈ చెరువు మొరవపోతూ సీటీఎం పెద్దచెరువుకు చేరుతోంది. మదనపల్లె మండలం వడ్డిపల్లె ఎగువన హంద్రీ-నీవా కాలువ నీటిని కింది వైపు చెరువుకు మళ్లించేందుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చర్యలు తీసుకున్నారు. హంద్రీ-నీవా అధికారులతో మాట్లాడి కాలువ నీటిని సింఫోనిక్ పద్ధతి విధానంలో 10 పైపులతో నీటిని కింది వైపునకు ఎత్తిపోస్తున్నారు. ఇక్కడి నుంచి సప్లై చానెళ్ల ద్వారా బసినికొండ పంచాయతీలోని సిద్దలచెరువు, రెడ్లచెరువు, వడ్డిచెరువు, పాములచెరువు, బుచ్చన్నచెరువు, తాటిచెరువు, పెద్దచెరువు, మాచిరెడ్డిగారిచెరులకు నీటిని మళ్లించారు. పది రోజులుగా నాలుగు చెరువులు నిండిపోయి దిగువన వున్న చెరువులకు మొరవ నీటిని వదులుతున్నారు. వీటితో పాటు సీటీఎం పెద్దచెరువు కృష్ణా జలాలతో దాదాపు నిండిపోయింది. ఇదిలా వుండగా ఇటీవల కురిసిన వర్షాలతో మదనపల్లె మండలంలో కొత్తపల్లెచెరువు, వలసపల్లె చెరువు, పొన్నెప్పనాయునిచెరువు, రంగనాథుని ఒడ్డు, జన్యవాణి చెరువు ముప్పాతిక శాతం నీటితో కళకళలాడుతున్నాయి.

డివిజన్‌లో నిండిన 425 చెరువులు

మదనపల్లె జలవనరుల శాఖ డివిజన్‌లో మొత్తం 2097 చిన్న, పెద్దచెరువులు ఉండగా ఇటీవల తుఫానుల కారణంగా కురిసిన వర్షాలతో 425 చెరువులు 100 శాతం నిండిపోయాయి. 531 చెరువులు 75 శాతం నిండగా, 413 చెరువులు 50 శాతం నిండాయి. దీనిని బట్టి చూస్తే డిసెంబర్‌లో మరో తుఫాను వస్తే డివిజన్‌లో 40 శాతం చెరువులు నిండిపోతాయని అంచనా. ఇదే జరిగితే రైతులకు సాగునీరు, గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందుబాటులోకి రానుంది.


హంద్రీనీవా నీటిని పైప్‌లైన్లతో తోడుతున్న దృశ్యం


పెరుగుతున్న భూగర్భ జలాలు

మదనపల్లె డివిజన్‌లో పలుచోట్ల భూగర్భ జలాలు పెరుగుతున్నాయని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. హంద్రీ-నీవా కాలువకు దిగువ ప్రాంతాలు, వందలాది చెరువుల కింద ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతున్నాయని అంటున్నారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు సాధారణంగా 28.17 మీటర్ల నుంచి 112.84 మీటర్ల లోతున నమోదవుతాయి. వర్షాకాలం తరువాత 5 నుంచి 10 మీటర్లు పైకి భూగర్భ జలాలు ఎగబాకుతాయి. ఈసారి 16 మీటర్ల పైకి భూగర్భ జలాలు ఎగబాకాయని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రికి కొందరు జలవనరులశాఖ ఇంజినీర్లు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఏది ఏమైనా వర్షాలు కురిసే పరిస్థితి ఇలాగే నెలరోజులు సాగితే మదనపల్లె డివిజన్‌లో వచ్చే ఏడాది వేసవికి నీటి ఎద్దడి ఉండబోదన్న శుభపరిణామాలు ఎదురు కానున్నాయి.


హంద్రీ-నీవా నీటితో 90 శాతం నిండిన సీటీఎం పెద్దచెరువు


హంద్రీనీవా నీటితో నిండి మొరవపోతున్న రెడ్లచెరువు

ఎనిమిది చెరువులకు కృష్ణా జలాలు



మదనపల్లె మండలంలోని బసినికొండ ప్రాంతానికి ఎగువన హంద్రీ-నీవా కాలువ నిర్మాణం వలన కింది భాగంలో ఉన్న చెరువులకు వర్షపునీరు సప్లై చానెళ్లలో పారడం లేదు. ఈ విషయం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. ఆయన హంద్రీ-నీవా అధికారులతో మాట్లాడి సింఫోనిక్ పద్ధతిలో హంద్రీ-నీవా నీటిని పైపులైన్లతో తోడి కింద వున్న సప్లై చానెళ్లకు వదులుతున్నాము. ఎనిమిది చెరువులకు కృష్ణా జలాలు వస్తున్నాయి.

- రాయలబాబు రాజేంద్రప్రసాద్, ఏఈఈ, జలవనరుల శాఖ, మదనపల్లె

సబ్ కలెక్టర్‌కు వినతుల వెల్లువ


సబ్‌కలెక్టర్ కళ్యాణికి అర్జీలు అందజేస్తున్న ప్రజలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి వినతులు వెల్లువలా వచ్చాయి. సోమవారం సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 148 మంది వరకు అర్జీదారులు వారి సమస్యలు విన్నవించుకున్నారు. మదనపల్లె శివారులోని వడ్డిపల్లె వద్ద స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ నిర్మించి 50 మందికి ఉపాధి చూపుతున్నామని, కార్మికులు వచ్చి వెళ్లేందుకు హంద్రీనీవా కాలువ అడ్డంగా ఉందని, ఈ కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పెరవలి రెడ్డెప్ప సబ్ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. కోళ్లబైలు గ్రామ పంచాయతీకి నెల రోజులుగా కార్యదర్శిని నియమించలేదని, పాలనాపరంగా పనులన్నీ నిలిచిపోయాయని సర్పంచ్ ఎం.ఆనందరెడ్డి సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన భర్త టీడీపీ నాయకుడు మహబూబ్‌ఖాన్ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఎస్‌బీఐ కాలనీకి చెందిన జోయాఖాన్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. గతంలో ఈ విషయమై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయాలని బాధితురాలు తెలిపింది. వీటితో పాటు సర్వే సమస్యలు, దారి సమస్యలు, కొత్త పింఛన్ల కోసం, పాసుపుస్తకాల కోసం పలువురు అర్జీలు అందజేశారు.

ఆరు ఎర్రచందనం దుంగల పట్టివేత


వాహనం, ఎర్రచందనం దుంగలతో ఫారెస్టు అధికారులు

పీలేరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనంతో సహా రూ.5 లక్షల విలువ గల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఎస్.శ్రీనివాసులు తెలిపారు. డీఎఫ్‌వో కథనం మేరకు... తలకోన నుంచి ఎర్రచందనం అక్రమ రవాణాపై ముందుగా అందిన రహస్య సమాచారం మేరకు చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని పులిచెర్లలో సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు టాటా ఇండిగో ఏపీ03 ఏడబ్ల్యూ 1134 నెంబరు గల వాహనం అతివేగంగా వచ్చిందన్నారు. వాహనాన్ని ఆపకుండా డ్రైవర్ పులిచెర్ల నుంచి మంగళంపేట మార్గంలో వేగంగా తప్పించుకునే ప్రయత్నం చేశారని చెప్పారు. ఇంతలో అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు ఆ వాహనాన్ని వెంబడించగా రెడ్డివారిపల్లె మార్గం సమీపంలో రోడ్డు పక్క వాహనాన్ని ఆపి డ్రైవర్, అందులోని స్మగ్లర్లు పారిపోయినట్లు తెలిపారు. వాహనాన్ని స్వాధీనం తనిఖీ చేయగా ఆరు ఎర్రచందనం దుంగలను గుర్తించామని తెలిపారు. వాహనంతో పాటు ఎర్రచందనాన్ని పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాడిలో ఎఫ్ఆర్‌వో ఎస్.చంద్రశేఖర్, సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థి



పుల్లంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థి రిషిత్‌వర్మ ఎంపికయ్యారు. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు గుంటూరు జిల్లా మైదుకూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కడప జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో ప్రతిభ ప్రదర్శించిన రిషిత్‌వర్మ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కడప జిల్లా సెక్రటరీ చంద్రమోహన్‌రాజు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠరావు విద్యార్థిని అభినందించారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న మునిక్రిష్ణ

పెనగలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాదేమోనన్న అనుమానంతో ఓ వ్యక్తి గొంతులో చాకుతో పొడుచుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు పెనగలూరు పోలీసుస్టేషన్ రైటర్ గోపాల్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా రాపూరు మండలం గోనుపల్లెకు చెందిన దొడ్డవరపు మునికృష్ణ సోమవారం సాయంత్రం పెనగలూరు మండలం పద్మగారిపల్లె హరిజనవాడలో ఉన్న తన భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. అత్తింటివారిని బెదిరించే క్రమంలో చాకుతో గొంతులో పొడుచుకున్నాడు. అత్తింటివారే తనపై దాడి చేసినట్లు చెబుతున్నాడని, అతడిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు రైటర్ వివరించారు.

ఆస్తుల కోసం వేధిస్తున్నారు..


సబ్ కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధ దంపతులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాము కష్టపడి సంపాదించిన ఆస్తుల కోసం తమ కోడలు, మనవరాళ్లు వేధింపులకు గురి చేస్తున్నారని వృద్ధ దంపతులు చిన్నప్ప, గోపమ్మ సోమవారం పీజీఆర్‌ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ గోడును సబ్ కలెక్టర్ కళ్యాణికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురబలకోట మండలం, తెట్టు గ్రామం గుంతపల్లెవంకకు చెందిన తమకు ముగ్గురు పిల్లలు సుధాకర్, సురేష్‌కుమార్, కుమార్తె కమల ఉన్నారన్నారు. కాగా సుధాకర్ వివాహం కాకుండానే చనిపోయాడని, సురేష్‌కుమార్‌కు భార్య మంజుల, ముగ్గురు కుమార్తెలు మానస, పావని, నవ్యశ్రీలు ఉన్నారు. ఏడాది క్రితం సురేశ్‌కుమార్ చనిపోగా అప్పటి నుంచి తమ ఆస్తుల కోసం పాకులాడుతున్నారని, మా బాగోగులు చూడడం లేదని వాపోయారు. గ్రామంలో తమ దాయాదులు పూర్వీకుల ఆస్తులను భాగ పరిష్కారం చేయకుండా అడ్డుపడుతున్నారని, నీరుగట్టువారిపల్లెలోని సొంత ఇంటిని తమ కోడలు లాక్కుని తమను గెంటేసిందని తెలిపారు. ఈ వయస్సులో వారి వేధింపులు భరించలేకపోతున్నామన్నారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

పరీక్షా పే చర్చకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి శ్రీనివాస్ వెల్లడి

రాయచోటిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేరుగా మాట్లాడే ప్రతిష్టాత్మక కార్యక్రమం పరీక్షా పే చర్చ-2026లో పాల్గొనేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ తిరుపతి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని డైట్ ప్రాంగణంలో పరీక్షా పే చర్చపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్‌గా ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పరీక్ష పే చర్చ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమై జనవరి 11వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ పరీక్ష పే చర్చలో పాల్గొనదలుచుకున్న వారు ఇన్నోవేట్ ఇండియా-1 మై గవర్నమెంట్ ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించి పార్టిసిపేట్ నౌ బటన్‌పై క్లిక్ చేసి విద్యార్థి, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు అనే ఎంపికను ఎంచుకుని మొబైల్ నెంబర్ లేదా ఈ-మెయిల్ ద్వారా లాగిన్ అయి తమ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఇచ్చిన థీమ్సలలో ఒక దానిని ఎంచుకుని 500 అక్షరాల లోపు ఉండే విధంగా ఒక ప్రశ్న లేదా అభిప్రాయాన్ని తెలపాలన్నారు. వాటిలో ఉత్తమ ప్రశ్న లేదా అభిప్రాయాన్ని ఎంపిక చేస్తారని, అలా ఎంపికైన అభ్యర్థులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుందని చెప్పారు. అంతేగాక పరీక్ష పే చర్చ కోసం రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ జనవరి 12 నుంచి ప్రశంసాపత్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక సర్టిఫికెట్లు, ఎగ్జామ్ వారియర్స్ కిట్‌లు బహుమతులుగా అందజేస్తామని వెల్లడించారు. ఈ సువర్ణావకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు శివభాస్కర్, గిరిబాబుయాదవ్, ఆంగ్ల ఉపాధ్యాయులు పరశురాం, విద్యార్థులు పాల్గొన్నారు.


డైట్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కో-ఆర్డినేటర్

జిల్లా కేంద్రం ఆందోళనలకు సహకరిస్తా : చమర్తి

రాజంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట జిల్లా కేంద్రానికి తాము కట్టుబడి ఉన్నామని, జేఏసీ నిర్వహించే కార్యక్రమాలకు తాము అన్నివిధాలుగా సహకరిస్తామని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం రాత్రి రాజంపేట జిల్లా సాధన జేఏసీ నేతలు చమర్తితో సమావేశమయ్యారు. జేఏసీ నేతలు లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌నాయుడు, పూల భాస్కర్ తదితర నేతలు జిల్లా సాధనకు జగన్‌మోహన్‌రాజు సహకారాన్ని కోరారు. ఇందుకు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ రాజంపేట ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా తాము జిల్లా కేంద్రం సాధనకు అన్నివిధాలుఏగా సహకరిస్తామన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. న్యాయపరంగా జిల్లా కేంద్రానికి కావాల్సిన అర్హతలు రాజంపేటకు ఉన్నాయన్నారు. ప్రతి ఇంటి నుంచి జిల్లా కేంద్రానికి మద్దతు తెలుపుతున్నందున వారితో పాటు తాను పాల్గొంటానన్నారు. ప్రాంతం కంటే భవిష్యత్ తరాల కోసం అందరూ కలిసి నడవాల్సి ఉంటుందన్నారు. గతంలో రాజంపేట జిల్లాకు వైసీపీ చేసిన కుట్రలను ఈసారి భగ్నం చేస్తామన్నారు. స్వార్థ రాజకీయాలను పక్కనబెట్టి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాను ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, రూరల్ అధ్యక్షుడు మేడికొండు రవికుమార్‌నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, సుబ్రమణ్యంనాయుడు, జేఏసీ నాయకులు వర్దిబోయిన సుధాకర్‌బాబు, చల్లా సుధాకర్‌బాబు, రవీంద్ర, డిగ్రీ కళాశాలల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గీతాంజలి రమణ, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.


జగన్‌మోహన్‌రాజుతో సమావేశమైన జేఏసీ నాయకులు

అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

ములకలచెరువు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పీలేరు ఏడీఏ రమణారావు హెచ్చరించారు. స్థానికంగా ఉన్న ఎరువులు, విత్తనాల దుకాణాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అమ్మే ఎరువులు, విత్తనాలకు సంబంధించి జీఎస్టీ బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎక్కడైనా ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లయితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఏవో స్రవంతి తదితరులు ఉన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న పీలేరు ఏడీఏ రమణారావు

గుర్రంకొండలో రెండు ఇళ్లలో చోరీ

బంగారు, వెండి ఆభరణాల అపహరణ


ఖాదర్‌బాష ఇంటిలో వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

గుర్రంకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణంలో వరుస చోరీలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. డోర్ లాక్ చేసిన ఇళ్లను దుండగులు రెక్కీ చేసి మరీ దోచుకొంటున్నారు. దీంతో ప్రజలు ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఎం.డీ.పరహాద్ సెల్‌ఫోన్ దుకాణాలను నిర్వహించుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సొంత పనుల నిమిత్తం శనివారం సాయంత్రం రాయచోటిలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని ఆదివారం రాత్రి 10.30 గంటలకు గుర్రంకొండలోని ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి డోర్ లాక్ బ్రేక్ చేసి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా ఇంటిలోని మూడు బీరువాలను దుండగులు ధ్వంసం చేసి బట్టలను చిందరవందరగా పడేశారు. అంతేకాకుండా బీరువాలోని 50 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదును చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే నబీకాలనీలో నివాసముంటున్న ఖాదర్‌బాష కుటుంబ సభ్యులతో కలిసి మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను కలవడానికి శనివారం మధ్యాహ్నం వెళ్లారు. అక్కడే రాత్రి ఉండి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. శనివారం అర్ధరాత్రి సమయంలో దుండగులు ఇంటి తాళం పగలకొట్టి బీరువాలోని 750 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదును దోచుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం చోరీ జరిగిన ఇళ్లలో క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించారు. పట్టణంలో జరిగిన రెండు చోరీలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పలు ప్రాంతాల నుంచి భక్తులు మల్లయ్యకొండకు చేరుకుని భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు.

అర్చకులు ఈశ్వరప్ప మల్లికార్జున స్వామిని ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యాలతో పంచామృతాభిషేకాలు, భక్తుల పేరిట అర్చనలు నిర్వహించారు. కొండపైన ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కొండపైన ఆలయానికి సమీపంలో ఉన్న గౌరమ్మ అమ్మవారిని, మార్గమధ్యలో ఉన్న ఏనుగు మల్లమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఏనుగు మల్లమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం మల్లయ్యకొండపైకి ఆర్టీసీ బస్సులను నడిపారు.


ప్రత్యేక అలంకరణలో ఏనుగు మల్లమ్మ అమ్మవారు

కమ్మేస్తున్న పొగమంచు...

రైల్వేకోడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కోడూరులో వర్షాలు భారీగా కురిసి ఆగిపోయాయి. రైల్వేకోడూరు చుట్టూ అడవులు, నదులు ఉండడంతో చలి ప్రభావం ఎక్కువగా ఉంది. దీనికి తోడు ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచి పొగమంచు మొదలవుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున కోడూరు ప్రధాన దారిలో పొంగమంచుతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. రోజు, రోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 3 గంటల నుంచే చలిగాలి వీస్తోంది. వాకింగ్ చేసేవారు, పాదచారులు, వాహనదారులు ఇటు చలి, అటు పొగమంచుతో ఇక్కట్లు పడుతున్నారు.


పొగమంచుతో కనిపించని వాహనాలు


కోడూరు ప్రధాన దారిని కమ్మేసిన పొగ మంచు

రోడ్డు ప్రమాదంలో మహిళా ఉద్యోగి మృతి



కుమారి (ఫైల్)

పులివెందుల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తొండూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుమారి (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో విధులు ముగించుకొని తొండూరు నుంచి పులివెందులకు వెళ్లేందుకు రోడ్డుపై బస్సు కోసం ఎదురు చూస్తోంది. అదే సమయంలో ఓ టూవీలర్‌పై వెళుతున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగింది. అతను పులివెందులకే వెళ్తున్నానని చెప్పడంతో బైకుపై ఎక్కి వెళు తుండగా మడూరు వద్ద ఎదురుగా వస్తున్న లారీ బైకును ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న వ్యక్తికి ఎడమవైపునకు పడిపోయాడు. కుమారి కుడివైపు లారీ టైర్ల కింద పడిపోయింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై తొండూరు ఎస్ఐ ఘన మద్దిలేటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చదిపిరాళ్ల వద్ద యువకుడు...

కమలాపురంరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చదిపిరాళ్ల గ్రామ సమీపంలో కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో పాలెం ప్రభుదేవ (22) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు పోలీసులు సమాచారం మేరకు జంగంపల్లెకు చెందిన అవివాహితుడైన ప్రభుదేవ ఇళ్లకు ఎలక్ట్రిషియన్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం ఉదయం పందిళ్లపల్లెలో ఎలక్ట్రిషియన్ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. చదిపిరాళ్ల వద్దకు రాగానే కడప వైపు నుంచి వచ్చిన ఆల్విన్ వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో కింద పడిపోయాడు. అంతలోనే కంటైనర్ వాహనం వచ్చి ప్రభుదేవను తొక్కించుకుని వెళ్లడంతో కాళ్లు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ విద్యాసాగర్ తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని పరిశీలించారు. 108లో కడప సర్వజన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఆ మేరకు కేసు నమదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో కత్తితో దాడి..

చెన్నూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని స్టేట్‌బ్యాంకు సమీపంలో ఓ వైన్ షాపు దగ్గర మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి కత్తితో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో స్థానిక కొత్త గాంధీ నగర్‌కు చెందిన ప్రణవ్‌కుమార్ మద్యం తాగి చెన్నూరుకు చెందిన వెంకటయ్య అనే వ్యక్తితో గొడవ పడి కత్తితో దాడి చేశాడు. అక్కడే సమీపంలో ఉన్న ఆయన మేనల్లుడు వెంకటసుబ్బయ్య అడ్డుకునేందుకు వెళ్లగా అతనిపై దాడి చేశాడు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని కడప రిమ్స్‌కు తరలించారు. దాడికి పాల్పడిన ప్రణవ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

భార్యపై భర్త కత్తితో...

జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డి కాలనీలో ఆదివారం రాత్రి చాంద్‌బాష అనే వ్యక్తి అతని భార్య షేక్ మున్నీపై కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. వీరికి 11 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు కుమారులు ఉన్నారు. చాంద్‌బాష మద్యానికి బానిసై భార్యను ప్రతి రోజు వేధించేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మున్నీపై దాడి చేశాడు. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మీతులసి (ఫైల్)

కొండాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పట్టణంలో లక్ష్మీతులసి (36) అనే వివాహిత సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు లక్ష్మీతులసి ఇంట్లో మనస్పర్థల కారణంగా మనస్థాపం చెంది.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందింది. కాగా ఈమె భర్త రమణ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

భర్త వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు

కడప క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తరచూ భర్త వేధిస్తున్నాడని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... కడప వన్‌టౌన్ పరిధికి చెందిన విల్‌ఫ్రైడ్‌కు మౌనప్రియతో ఆరేళ్లక్రితం వివాహం జరిగింది. గత కొన్ని నెలలుగా ఆమెను వేధింపులకు గురి చేస్తుండడంతో కౌన్సిలింగ్ ఇచ్చారు. అతనిలో మార్పు కనిపించకపోవడంతో మౌనప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

లేడీస్ హాస్టల్‌లోకి చొరబడ్డ యువకుడు

కడప క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం పాతబస్టాండు సమీపంలో ఉన్న ఓ లేడీస్ హాస్టల్‌లోకి చొరబడ్డ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. కడపకు చెందిన సయ్యద్ ఆలీ సోమవారం మధ్యాహ్నం లేడీస్ హాస్టల్‌లోకి చొరబడ్డాడు. ఆ యువకుడిని చూసిన అమ్మాయిలు గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. హాస్టలు నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా భద్రతపై అవగాహన

కడప క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు పాఠశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది సోమవారం మహిళా భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో మహిళల భద్రత, పోక్సో ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఎదుర్కొనే మానసిక ,శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై ఉదాహరణలతో వివరించారు.

రసాయనిక ఎరువులు, పురుగు మందులతో అనర్థాలు

- కాన్సర్, కిడ్నీ వగైరా వ్యాధులు
- ప్రకృతి వ్యవసాయాన్ని పెంచాలి
- ఏపీ ఎస్‌జీడీసీఎఫ్ఎల్ ఎండీ



మాట్లాడుతున్న ఏపీ ఎస్‌జీడీసీఎఫ్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్

కడప రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాలలో రసాయనిక ఎరువులు, పురుగుమందులను విరివిగా వాడడం వలన భూమి, నీరు, గాలి కలుషితమై తద్వారా విపరీతమైన అనర్థాలు దాపురించి సర్వ రోగాలకు మూలకారణం అవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ (ఏపీ ఎస్‌జీడీసీఎఫ్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. సోమవారం జడ్పీ సమావేశహాలులో హర్యాణలోని గురుగ్రామ్‌కు చెందిన పురుగు మందులు సూత్రీకరణ సాంకేతిక సంస్థ సహకారంతో స్థిరమైన వ్యవసాయాభివృద్ధి, పర్యావరణ అనుకూలమైన పురుగు మందులు, పద్ధతులపై వ్యవసాయ, పాడి రైతులకు, గొర్రెలు, మేకల పెంపకం దారులకు జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడిన పంటలను, పశుగ్రాసంపై ఆధారపడిన గొర్రెలు, మేకలు, గేదెలు, గేదె పాలు తదితర వాటిని మనుషులు ఆహారంగా తీసుకోవడం వలన కాన్సర్, కిడ్నీ వగైరా వ్యాధుల బారిన పడుతున్నారని పరిశోధనలలో వెల్లడైందన్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని విరివిగా పెంచాలన్నారు. సేంద్రియ ఎరువులు, జీవామృతం, ఘనజీవామృతాల ద్వారా పండించే పంటలకు చాలా డిమాండ్ ఉందన్నారు. వీటి ఉత్పత్తులను ప్రజలు కొనడానికి ముందుకు వస్తున్నారు. ఆరోగ్యానికి కూడా చాలా మంచిదన్నారు. గొర్రెలు, మేకల సొసైటీలలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది మెంబర్స్ ఉన్నారన్నారు. ఇందులో మహిళా సభ్యుల భాగస్వామ్యాన్ని తీసకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ప్రతి జిల్లా నుంచి 2 నుంచి 3 వేల మంది మహిళలను చేర్చేలా చర్యలు చేపడుతున్నా యన్నారు. ఎంతమంది మహిళలు ఉంటే అందరికి ఫెడరేషన్ గొర్రెలు, మేకల యూనిట్‌ల ఏర్పాటుకు రుణాలు ఇస్తామన్నారు. గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం చైర్మన్, నాగమల్లేశ్వరయ్య, తాడేపల్లెగూడెం పెస్టిసైడ్ స్పెషలిస్టు రాజశేఖర్, ఐపీఎఫ్‌టి స్పెషలిస్టు దీపక్‌కుమార్ జైస్వాల్, మాంగేష్ అశోక్ రావు పాండే, ఏపీఎస్‌జీడీసీఎఫ్ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణి, అన్నమయ్య జిల్లా డీఏహెచ్‌వో కె. గుణశేఖర్‌పిళ్లై, ఐఎస్‌డీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. రావణరెడ్డి, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, పులివెందుల వెటర్నరీ సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారద, వ్యవసాయశాఖ ఏడీఏ నాగరాజు తదితరులు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు చేప్పే సూచనలు పాటించి పంటల సాగులో ఖర్చు బాగా తగ్గించుకొని, నాణ్యమైన ఉత్పత్తులను సాధించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించాలన్నారు. నానోటెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంజలిజెన్స్, డ్రోన్ సిస్టమ్స్ వంటి టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. పర్యావరణహిత వ్యవసాయాన్ని రైతులందరూ చేపట్టాలన్నారు. తాతల హయాంలో పురుగుమందులు లేకుండా వ్యవసా యం నడిచిందన్నారు. 1970 దశకమునుండే పురుగుమందులను వాడుతున్నామని, దీనివలన ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వ్యవసాయ, పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారుల సభ్యులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాకే.. పనులు చేపట్టండి

- టెయిలింగ్‌పాండ్ వద్ద కేకే కొట్టాల గ్రామ ప్రజల నిరసన



కేకే కొట్టాల గ్రామ ప్రజలతో చర్చలు జరుపుతున్న ఆర్డీవో

వేముల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మా సమస్యలు పరిష్కరించి.. టెయిలింగ్ పాండ్ విస్తరణ పనులు చేపట్టుకోవాలని కేకే కొట్టాల గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. టెయిలింగ్ పాండ్ వద్ద సోమవారం ఉదయం 10గంటల సమయంలో నిరసనకు దిగారు. యూసీఐఎల్ అధికారులు టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు ప్రారంభిస్తున్నారని తెలియడంతో కేకే కొట్టాల ప్రజలు అక్కడకు చేరుకున్నారు. యూసీఐఎల్ పరివాహక గ్రామాలైన మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లె తదితర గ్రామాల ప్రజలు కూడా తరలివచ్చారు. పరిస్థితి చక్కదిద్దేందుకు ఆర్డీవో చిన్నయ్య, డీఎస్పీ మురళినాయక్ అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. ఇందుకు కేకే కొట్టాల గ్రామ ప్రజలు స్పందిస్తూ 2018 నుంచి ఇప్పటికి పలుమార్లు టెయిలింగ్ పాండ్ విస్తరణ పనులు చేపట్టారన్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. యూసీఐఎల్ మా సమస్యలు పరిష్కరిస్తేనే టెయిలింగ్‌పాండ్ విస్తరణకు ఒప్పుకుంటామని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఆర్డీఓ చిన్నయ్య మాట్లాడుతూ తనకు కొంత సమయం ఇస్తే యూసీఐఎల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకు ప్రజలు అంగీకరించి ఆందోళన విరమించారు. టీడీపీ నాయకులు పార్థసారధిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు వీరికి మద్దతు పలికారు.

పనులు వేగవంతం చేయండి : పీడీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి సిబ్బందిని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్‌స్టాఫ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా ఇప్పటి వరకు జరిగిన ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగి పనులకు వస్తున్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు పీడీ రామలింగారెడ్డి, వివిధ మండలాల ఏపీవోలు, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సర్వేయర్ల ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం

కడప కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వేయర్ల ఉద్యోగ సంఘ ఎన్నికలు ఆదివారం రాత్రి పాత కలెక్టరేట్‌లో గల సర్వేయర్ల సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు రెడ్డప్ప ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా వైఎస్ సలీం, ఉపాధ్యక్షుడుగా షేక్ ఇస్మాయిల్, సెక్రటరీగా జోష్‌రాజు, జాయింట్ సెక్రటరీగా బాలాజీ, కోశాధికారిగా అన్నమలై శ్రీనివాసన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మల్లికార్జున, శ్రీనివాసులు, అబ్దుల్‌సలాం, మహబూబ్‌బాష, సుబ్బరాయుడు, నరసింహులు ఎన్నికయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పుర పరిపాలన శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Short Tender Notice No. 39 to 41/2025-26/E1, Dt. : 08-12-2025

పులివెందుల పురపాలక సంఘము నందు అభివృద్ధి పనులకు సంబంధించి దిగువ తెలిపిన మేరకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది.

వ.నెం.	టెండరు నోటీసు నెం.	పనుల సంఖ్య	అంచనా మొత్తము
1.	39/2025-26 15th FC Grants	1	రూ. 16.76 లక్షలు
2.	40 to 41/2025-26 MPLADS	2	రూ. 50.00 లక్షలు

బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడింగ్ ప్రారంభపు తేది : 09-12-2025 ఉ.10.30 గం.
బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడింగ్ ముగింపు తేది. 23-12-2025 మ.3.00 గం.
బిడ్స్ స్వీకరణ చివర తేది. 23-12-2025 మ. 3.30 గంటలకు
బిడ్స్ తెరుచు తేది 23-12-2025 సా. 4.30 గంటలకు

తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే www.ap.eprocurement.gov.in లో చూడవచ్చును. ఫోన్ : 98665 56185

సం/- కమీషనరు, పులివెందుల పురపాలక సంఘము

పరకామణి కేసు.. జగన్‌కు చిన్న విషయమా!

- టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి




పులివెందులలో టీటీడీ కల్యాణమండపాన్ని పరిశీలిస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి

పులివెందుల/చక్రాయపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి టీటీడీ పరకామణి కేసు చిన్నవిషయం అనడం దారుణమని టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల టీటీడీ కల్యాణమండపాన్ని సోమవారం పరిశీలించారు. ఆధునుకీకరణ పేరుతో ప్రజలకు అందుబాటులో లేని కల్యాణమండపాలను పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరకామణి దొంగతనాన్ని చిన్నదని జగన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మాటలను బట్టి చూస్తుంటే దొంగలకు భరోసా ఇస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. అలాగే తిరుమల లడ్డుకు సంబంధించి కల్తీ నెయ్యి కేసులో అరెస్టులు కొనసాగుతాయన్నారు.

పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు....

పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు టీటీడీ నిధులు మంజూరు చేస్తున్నట్లు భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ పూర్ణఫలంతో స్వాగతం పలికి... పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ప్రధాన అర్చకులు కేసరి కోరారు. అలాగే స్వామి దేవస్థానం ప్రహరీగోడ, బండపరుపుతో పాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ టీవీ రమణ కోరారు. కాగా, పురాతన దేవాలయాలకు దూపదీప నైవేద్యాల కోసం టీటీడీ నిధులు మంజూరు చేస్తుందని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, వేదపారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, గోపాలస్వామి, గండి దేవస్థానం మాజీచైర్మన్ కల్లూరు వెంకటస్వామి, బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, మండల అధ్యక్షుడు నవీన్, అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కె.రామచంద్రారెడ్డి, బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి వాజ్‌పేయినాయుడు, అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు శివమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రాగా ముగిసిన క్రికెట్‌మ్యాచ్‌లు



జైవర్ధన్‌నాథ్, రక్షణ్‌సాయి

కడప స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు సోమవారం డ్రాగా ముగిశాయి. వివరాలిలా...

కేవోఆర్ఎం మైదానంలో రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్-నార్త్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి రోజు 23 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసింది. రెండో రోజు సోమవారం బ్యాటింగ్‌కు దిగి 64.1 ఓవర్లలో 131 పరుగులకే ఆలౌట్ అయింది. రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ బౌలర్ లోకేష్‌రెడ్డి 5 వికెట్లు సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 41 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. నార్త్‌జోన్ విన్నర్స్ బౌలర్ రుత్విక్ 5 వికెట్లు పడగొట్టారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సెంట్రల్ జోన్ విన్నర్స్-రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 300 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి రోజు 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 12 పరుగులు చేసింది. రెండవ రోజు బ్యాటింగ్‌కు దిగి 74.1 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌట్ అయింది. సెంట్రల్‌జోన్ విన్నర్స్ బౌలర్ జైవర్ధన్‌నాథ్ 5 వికెట్లు సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది

కేఎస్ఆర్ఎం మైదానంలో సౌత్‌జోన్ విన్నర్స్-రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 251 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 39 పరుగులు చేసింది. తిరిగి రెండవ రోజు బ్యాటింగ్‌కు దిగి 60 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలర్ రక్షణ్‌సాయి 5 వికెట్లు సాధించాడు. దీంతో సౌత్‌జోన్ విన్నర్స్ జట్టుకు 67 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. ఇందులో మణిదీప్ 54పరుగులు చేశారు. మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

పాయింట్ల వారిగా వివరాలలో.....

రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు ఆడిన 5 మ్యాచ్‌లకు 15పాయింట్స్ సాధించి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. నార్త్‌జోన్ విన్నర్స్ (విశాఖ), సెంట్రల్‌జోన్ విన్నర్స్ (క్రిష్ణా) 11 పాయింట్లతో ద్వితీయ స్థానాలను, రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 9 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలించింది. రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్, సౌత్‌జోన్ విన్నర్స్ (చిత్తూరు) 7 పాయింట్లతో చివరి స్థానం పొందాయి.

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్ : 90105 01122.
AJC-258911

కావలెను

ప్రొద్దుటూరు ప్లైవుడ్ షాపు నందు పవర్ టూల్స్, సేల్స్& మెకానిక్ షాప్ సేల్స్‌మెన్, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీసు బాయ్, అవుట్‌డోర్ సేల్స్‌మెన్ కావలెను. సెల్ : 91004 63787
Ajc-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర॥7382114647
AJA- 257599

పాస్‌పోర్టు పోయినది

షేక్ జీనత్ తండ్రి షేక్ గౌస్‌పీర్ D.No. 8/76-A, ఖాదరబాదు గ్రామం, ప్రొద్దుటూరు మం. కడపజిల్లా ఆంప్ర. నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. G8263341 పోయినది. దొరికిన వారు తెలుపగలరు. సెల్ : 80083 74164
Ajc-000

CHANGE OF NAME

I TAPPA SHOUKHATH ALI [OLD NAME] S/O TAPPA MAHABOOB BASHA, D.NO. 10/218-1 TEACHERS COLONY, PRODDATUR-516362 HAVE CHANGES MY NAME FROM TAPPA SHOUKHATH ALI [OLD NAME] TO SHAIK TAPPA SHOWKAT ALI [NEW NAME]. HENCE FORTH I MAY CALLED AS SHAIK TAPPA SHOWKAT ALI FOR ALL PURPOSES
AJC-000

CHANGE OF NAME

I TAPPA FARIDA BEGUM [OLD NAME] W/O TAPPA SHOUKHATH ALI, D.NO.10/218-1 TEACHERS COLONY, PRODDATUR-516362 HAVE CHANGES MY NAME FROM TAPPA FARIDA BEGUM [OLD NAME] TO SHAIK TAPPA FARIDA BEGUM [NEW NAME]. HENCE FORTH I MAY CALLED AS SHAIK TAPPA FARIDA BEGUM FOR ALL PURPOSES
AJC-000

యూనిట్ కార్యాలయం
9985411183
9985411193

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

రక్షణ కల్పించండి

- ఎస్పీకి ప్రేమజంట ఫిర్యాదు



ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

కడప క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ తల్లిదండ్రులు బంధువులతో తన భర్త మనోహర్, వారి కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని వారికి రక్షణ కల్పించాలంటూ యువతి షేక్ సుష్మాన్‌బేగం పేర్కొంది. తన భర్తతో కలిసి సోమవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు అందించారు. గత కొంతకాలంగా పులివెందుల మండలం కొండూరుకు చెందిన మనోహర్ తాను ప్రేమించుకున్నామని, ఇరువురం డిగ్రీ చదువుతున్న సమయంలో తమ ప్రేమ గురించి ఇంట్లో చెబితే కుటుంబసభ్యులు నిరాకరించడంతో డిసెంబరు 2న వివాహం చేసు కున్నట్లు తెలిపారు. తాము పోలీసులను ఆశ్రయించగా ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేశారన్నారు. ఆ సమయంలో తన తండ్రి ఫకృద్దీన్ తమ బిడ్డ తమకు అవసరం లేదంటూ పోలీసులకు చెప్పి వెళ్లిపోయాడన్నారు. అయితే గత మూడు రోజులుగా తన భర్త మనోహర్, వారి అమ్మానాన్నల వద్దకు తమ బంధువు లతో వెళ్లి వారిపై బెదిరింపు లకు పాల్పడుతున్నారన్నారు. తమ కుటుంబ సభ్యుల కారణంగా తన భర్తకు, అత్తమామలకు ప్రాణ హాని ఉందని.. తమకు రక్షణ కల్పించాలంటూ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో దొంగనోట్ల ముఠా

బత్తలపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటగారిపల్లి క్రాస్ వద్ద దొంగనోట్ల ముఠాను పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, కడప జిల్లా తాళ్ల ప్రొద్దుటూరుకు చెందిన అంజి, చామూరుకు చెందిన ఓబులేసు, బోడాయపల్లికి రెందిన రాజకుల్లయప్ప నకిలీ నోట్లను అదే జిల్లా కమలాపురం మండలం నల్ల లింగాయపల్లికి చెందిన వీరాంజినరెడ్డికి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అసలు నోట్లు రూ.లక్ష తీసుకుని, రూ.3 లక్షల నకిలీ నోట్లను గత నెల 19న ఇచ్చారు. వీటిని మార్చే ప్రయత్నం చేసిన వీరాంజినరెడ్డికి చుక్కెదురైంది. నకిలీ నోట్లను జనం సులభంగా గుర్తించడంతో మార్చడం సాధ్యం కాలేదు. దీంతో ఆగ్రహించిన వీరాంజినరెడ్డి, నకిలీ నోట్లు సమకూర్చిన ముగ్గురినీ నిలదీశాడు. ఈ క్రమంలో ఇరువర్గాలవారు వెంకటగారిపల్లి క్రాస్ వద్ద సోమవారం రాత్రి గొడవపడ్డారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో గాయపడిన వీరాంజనరెడ్డి, డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. బత్తలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలవారిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రాష్ట్ర హోంమంత్రిని కలిసిన ఎస్పీ



హోంమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ

కడప క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితను ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం విమానంలో కడప ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన మంత్రి అనితను ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు.

అచ్చెన్నాయుడును కలిసిన హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి



మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పర్యటనలో భాగంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోంమంత్రి అనితలకు కడప విమానాశ్రయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జమ్మలమడుగు నియోజకవర్గం పోట్లదుర్తి గ్రామంలో అనకాపల్లె ఎంపీ సీఎం రమేష్ మాతృమూర్తి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత సీఎం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టూటౌన్ ఎస్ఐగా రామక్రిష్ణ

కడప క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం టూటౌన్ పోలీసుస్టేషన్ ఎస్ఐగా రామక్రిష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కి చెందిన ఈయన ఉమ్మడి జిల్లాలోని పలు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం అట్లూరు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

లింగాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అరటిలో సమగ్ర యాజమాన్యంతోనే అధిక దిగుబడులు సాధ్యమని కొవ్వూరు అరటి పరిశోధన స్థానం ఉద్యానశాస్త్రవేత్త రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని మురారిచింతల, బోనాల సచివాలయాల పరిధిలో సిగటోక తెగులుపై అరటి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ సహాయ సంచాలకుడు రవిచంద్రబాబు నీటి యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

11వ వర్ధంతి

జననం: 7-3-1949 మరణం: 9-12-2014



కీ॥శే॥ కనపర్తి కోదండరామిరెడ్డి గారు
మాజీ సి.కె.దిన్నె మండల ఉపాధ్యక్షులు
శ్రీ బాలాజీ రెడిమేడ్స్, వై.వి.స్ట్రీట్, కడప.
మాజీ క్లాత్ మర్చంట్ అసోషియేషన్ అధ్యక్షులు
ఊటుకూరు గ్రామం, చింతకొమ్మదిన్నె మండలం

మంచితనం, మానవత్వానికి మారుపేరుగా నిలిచి అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ మా కుటుంబ ఉన్నతికైఅహర్నిశలు శ్రమించి తిరిగిరాని సుదూర తీరాలకు తరలివెళ్లిన కీ॥శే॥ కనపర్తి కోదండరామిరెడ్డి గారు మరణించి నేటికి 11 సంవత్సరాలు గడిచినసూమీ జ్ఞాపకాలు మా మదిలో పదిలం. మీ పవిత్రాత్మకు దైవసన్నిధిలో శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు: కనపర్తి శివశంకర్ రెడ్డి, కనపర్తి విజయకుమార్ రెడ్డి మరియు కుటుంబ సభ్యులు

ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం : కమిషనర్



చెత్త తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎన్. మనోజ్‌రెడ్డి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. నగర ప్రజల నుంచి వచ్చిన పలు ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారులతో సమీక్ష చేపట్టి, సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్‌చంద్ర, సూపరింటెండింగ్ ఇంజనీర్ చెన్నకేశవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాంబాబు, సిటీప్లానర్ శైలజ, హెల్త్ ఆఫీసర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు పరిశుభ్రంగా ఉండాలి

కడప కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రహదారులు ఉదయం 6గంటల లోపే శుభ్రపరచాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి శానిటేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 30వ డివిజన్‌లో పర్యటించారు. సెవెన్ రోడ్స్ సర్కిల్, ఓల్డ్ బస్టాండ్, గోకుల్‌లాడ్జి సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్ వంటి ప్రధాన కూడళ్లలో నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శానిటేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మాదిగల జీవనోపాధికి ఊతమివ్వండి

● కలెక్టరేట్ ఎదుట నిరసన.. ధర్నాలో దళిత, ప్రజాసంఘాలు



కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా చేస్తున్న దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు

కడప మారుతీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగర కార్పొరేషన్ పరిధిలోని కళాక్షేత్రం సమీప ప్రధాన తపాలా కార్యాలయం ఎదురుగా దాదాపు 70 ఏళ్లకు పైగా మాదిగలు చెప్పులు కుట్టుకుని జీవనం సాగిస్తున్నారని, వీరి జీవనోపాధికి ఊతమివ్వాలని దళిత, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరారు. ఆ మేరకు దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత, ప్రజాసంఘాల నాయకులు బీసీ గంగులు, గొడుగునూరు మునెయ్య, కె.మాతయ్య, ఆర్ఎస్ఎఫ్ నాయకులు ఓబులేసు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప మాట్లాడారు. నగర పరిధిలోని పక్కీరుపల్లె అరుంధతివాడకు చెందిన 20 మంది మాదిగలు గత కొన్నేళ్లుగా పాత చెప్పులు కుట్టుకుంటూ పొట్టనింపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాదిగ చర్మకారులు నాగరాజు, వెంకటసుబ్బయ్య, జి.వెంకటసుబ్బయ్యతో పాటుగా దళిత సంఘాల ప్రతినిధులు స్వామినాథం, సుబ్బరాయుడు, మల్లేసు, ఆంజనేయులు, ఓబులపతి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరించాలి'



కలెక్టరేట్ ఎదుట గోవిందమాల భక్తుల నిరసన దృశ్యం

కడప మారుతీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరించాలని శ్రీ సప్తగిరి గోవిందమాల సేవా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట వారు నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరుమల తొలి గడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప (కడప) నుంచి స్వామివారి భక్తులు భక్తి శ్రద్ధలతో అన్నమయ్య కాలిబాటన కొన్ని వందల ఏళ్లుగా తిరుమలకు చేరుకుంటున్న సంగతి తెలిసిందే అన్నారు. అలాంటి కాలిబాటను భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అర్థాంతరంగా మూసివేయడం సరైందికాదన్నారు. తక్షణమే అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు రామాంజులు, నాగరాజుతో పాటుగా పలువురు భక్తులు పాల్గొన్నారు.

కష్టపడే వారికే పార్టీ పదవులు : అంజద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడే వారికి పదవులు వస్తాయని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. సోమవారం కడప నగరం 43వ డివిజన్‌లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ కమిటీల నియామక కార్యక్రమాన్ని వెస్ట్‌జోన్ అధ్యక్షుడు నాగమల్లారెడ్డితో కలిసి అంజద్‌బాషా ప్రారంభించారు. డివిజన్ స్థాయి నుంచి పార్టీ బలపడేలా కమిటీలను ఏర్పాటు చేసి, ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీలేఖ, ఇన్‌చార్జి రెడ్డిప్రసాద్, జిల్లా నాయకులు దాసరి శివప్రసాద్, రమేష్‌రెడ్డి, షిండే రవి, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



వేంపల్లెలో బీటెక్ రవి సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలు

వేంపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలో టీడీపీ కార్యాలయంలో సోమవారం వైసీపీ, కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు, పలుకుటుంబాలు టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. బలిజ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కటికనాగరాజ, పులిగొండ్ల ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీమండల మాజీ ఉపాధ్యక్షులు ఆరుసేర్ల సుబ్బరాయుడు, భాస్కర్, నామా శ్రీనివాసులు, వడ్డెరసంఘం నాయకులు సంటెన్న, తదితరులకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పులివెందులలో పార్టీని మరింత బలోపేతం చేసిఎన్నికలోల గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు వీసీ ప్రశంసలు



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హిమాచల్ ప్రదేశ్ మనాలిలో 22వ తేదీ నుంచి ఈ నెల 1 వరకు జరిగిన అడ్వెంచర్ క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్, ట్రెక్కింగ్, రివర్ క్రాసింగ్ వంటి సాహస కార్యక్రమాలు నిర్వహించి మొత్తం 65 కిలోమీటర్లు టెక్కింగ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు కూడా చేశారు. వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ వలంటీర్లను తన చాంబర్‌లో అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు జీవితంలో ధైర్యాన్ని పెంపొందిస్తాయనిపేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ రాజగోపాల్ తదితరులుపాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లుకు సత్కారం



ఆర్టీసీ చైర్మన్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసులు

కడప మారుతీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా కడపకు విచ్చేసిన ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లు నారాయణరావును సోమవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో కడప డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి సగినాల శ్రీనివాసులు, గ్యారేజీ కార్యదర్శి రాయుడు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ దృష్టికి కడప డిపోతో పాటు రీజియన్ వ్యాప్తంగా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత రీజనల్ మేనేజర్ ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. ఆ దిశగా స్పందించి ఉద్యోగుల వెతలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాలప్రసాద్, లక్ష్మయ్య నాగయ్య, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్‌ప్లాన్ పనిదినాల్లో నిర్వహించాలి

● డీఈఓకు పీఎస్‌టీయూ వినతి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత పెంపు కోసం అమలు చేస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను సెలవురోజుల్లో కాకుండా, పనిదినాల్లోనే నిర్వహించాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కడప నగరం జయనగర్ కాలనీ జడ్పీ హైస్కూల్లో డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా నాయకులు డి.రామాంజనేయరెడ్డి, పీవీ సుబ్బారెడ్డి, బోగా వెంకటసుబ్బయ్య మాట్లాడారు.

రైతాంగ సమస్యలపై రేపు ఆందోళన

కమలాపురం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై డిసెంబరు 10న తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపడుతున్నామని, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో రైతు సంఘం సమావేశం నిర్వహించారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

వల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపాఘ్నినది కట్ట వద్ద సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని ఐచర్ మినీ లారీ ఢీకొట్టడంతో ఓబులేసు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. కడప నుంచి ఎర్రగుంట్ల మాలేపాడులోకి యూరియా లోడుతో వెళుతున్న ఐచర్ మినీ లారీ హెవీ స్పీడ్‌తో వచ్చి వ్యక్తిని ఢీకొంది. సంఘటనా స్థలంలో ఎస్ఐ శివనాగిరెడ్డి, పోలీసులు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. 108 అంబులెన్స్‌లో అతన్ని కడప రిమ్స్‌కు తరలించారు. మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

మా మంచి కాపరి క్రీస్తు : పాల్ ప్రకాశ్

కడప కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చర్చి ఆలయంలో యేసు నామం జపించడం వల్ల ఆయన మామంచి కాపరిగా అందరి జీవితాల్లో వెలుగులు నింపగలరని కడప మేత్రాసన పాలనాధికారి సగినాల పాల్ ప్రకాశ్ తెలిపారు. సోమవారం స్థానిక నగర శివారు ప్రాంతం ప్రకాశంపల్లిలో నూతనంగా చర్చి ఆలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. అమలో దబి వి మాత పర్వదిన రోజున నూతనంగా క్రీస్తు మామంచి కాపరి ఆలయాన్ని ప్రారంభించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. తదనంతరం పాల్ ప్రకాశ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు స్వాములు క్రీస్తు జ్యోతి మదర్స్, సిస్టర్స్‌తో పాటుగా పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

విత్తనపు చట్టం జీవో కాపీలు దహనం

సీకేదిన్నె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూతన విత్తనపు చట్టం బిల్లు జీవో కాపీలను దహనం చేసినట్లు ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న విత్తన బిల్లు 2025 పూర్తిగా కంపెనీల ప్రయోజనాల కోసమేనని, లింగారెడ్డిపల్లెలో బిల్లు కాపీలను దహనం చేయకూడదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, చిన్నసిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విఫలం: ఆర్ఎస్ఎఫ్

కమలాపురంరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు అన్నారు. సోమవారం కమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెండింగులో ఉన్న రూ.6400 కోట్లు స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంటు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు వంశీ, శివ, శేషాద్రి పాల్గొన్నారు.

కొనసాగుతున్న డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కడప క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సోమవారం కడప నగరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం చేసే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. కడప టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ జి.సుబ్బారావు ఆధ్వర్యంలో, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టారు.

ప్రతిభకు వైకల్యం అడ్డురాదు: ఏపీసీ



సర్టిఫికెట్ అందజేస్తున్న ఏపీసీ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు వైకల్యం అడ్డు కాదని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమ్నాద్‌కుమార్ తెలిపారు. సోమవారం కడప నగరం మున్సిపల్ మైదానంలో విభిన్న ప్రతిభావంతులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్ష అధికారి (ఏపీసీ) హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం ప్రతిభకు అడ్డుకాదు సంకల్పమే విజయాల సాధనకు మూలం అని పేర్కొన్నారు. వైకల్యాన్ని అధిగమించి క్రీడారంగంలో ముందుకు వస్తున్న విద్యార్థుల ధైర్యసాహసాలను ప్రశంసించారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహిత విద్యా సమన్వయకర్త రమణమూర్తి, ఐఈఆర్పీలు, వివిధ మండలాల విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ర్యాలీ దృశ్యం

వీరపునాయునిపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రమలపల్లె గ్రామంలో జరుగుతున్న వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో సోమవారం ఐదో రోజు కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ వి.సుధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ హేమనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు టీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధీర్ రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు రోడ్డు సేఫ్టీపై ప్రతిజ్ఞ చేసి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కమలాపురంరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి డీలరు రైతులకు ఎరువులను ఎమ్మార్పీ ధరలకు అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని బద్వేలు డివిజను వ్యవసాయ సంచాలకుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల స్టాకు రిజిస్టర్లను, స్టాకు బోర్డులను మెయింటెనెన్స్ చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలు రైతులకు కనబడేలా బోర్డులో ఉండాలని సూచించారు.

వందశాతం ఓటర్ల మ్యాపింగ్ చేయాలి

● ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు అహల్య

చెన్నూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నియోజకవర్గంలో బీఎల్‌వోలందరూ వారికి కేటాయించిన ఓటర్ల జాబితాలో వంద శాతం మ్యాపింగ్ చేయాలని కమలాపురం నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు అహల్య అన్నారు. సోమవారం చెన్నూరు తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో మాట్లాడారు. కేంద్రం 1.1.2002 నుంచి ఇప్పటివరకు ఉన్న ఓటర్ల జాబితాను 2002 జాబితాతో సరిపోల్చుకుని నివేదిక తయారు చేయాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చెన్నూరు, సీకేదిన్నె మండలాలు పూర్‌గా ఉన్నాయని, వీరపునాయనిపల్లె, పెండ్లిమర్రి, కమలాపురం, వల్లూరు మండలాలు కాసింత మెరుగ్గా ఉన్నాయన్నారు. బీఎల్‌వోలు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా గడువులోపు ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలని చెప్పారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం : ఎస్ఐ



అవగాహన కల్పిస్తున్న తాలుకా ఎస్ఐ

కడపక్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత సమాజం నిర్మాణం కోసం ప్రతిపౌరుడు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని తాలుకా ఎస్ఐ తులసినాగప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని మరియాపురంలో గల సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం స్కూలులో సోమవారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళాజాగృతి టీం, నార్కోటిక్ సెల్, ఈగల్ సెల్ సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ సురేశ్, హెడ్‌మిసెస్ ఫ్యాన్సీ, పోలీసు కళాజాగృతి టీం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరు రోజుల శిక్షణ

వేంపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాబోవు రోజుల్లో క్వాంటమ్ కంప్యూటింగ్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని, ఇందులో మంచి శిక్షణ పొందితే ఉద్యోగాలు పొందే అవకాశం ఎక్కువగా ఉంటాయని ఐబీఎం, సీడాక్ ప్రతినిధులు తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో నిర్వహించిన ఆరు రోజుల శిక్షణ సమావేశాలు సోమవారం ముగిశాయి. ఐబీఎం ప్రతినిధి జ్ఞానేయల్లా, సీడాక్ ప్రతినిధి తేజలు క్వాంటమ్ కంప్యూటింగ్‌లో కొత్త కొత్త ఆవిష్కరణలను ఎలా చేయాలి, తదితరవి తెలియజేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...

ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం

ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.

పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్

ప్రకటనలపై జి.యస్.టి. 5% అదనం

యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె
చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411193, 9985411189.

ప్రాంతీయ కార్యాలయాలు:
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు:9985921375 కోడూరు : 9985411193

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
D.C.M.: 99854 11184

రోడ్డుపై గొయ్యి.. ఆగిన రాకపోకలు



ప్రధాన రోడ్డులో పడినగొయ్యి

జమ్మలమడుగు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జమ్మలమడుగు- ప్రొద్దుటూరు రోడ్డులోని పి.సుగుమంచిపల్లి గ్రామ శివార్లలో ప్రధాన రోడ్డుపై భారీ గొయ్యి పడింది. దీంతో ఆ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా రోడ్డుపై ఏర్పడిన గొయ్యి కారణంగా గత బుధవారం రాత్రి ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఏపీ29జెడ్3893 గుంత వద్ద ఆగిపోవడంతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు వాపోయారు. ఆ ఘటన రాత్రి 9 గంటల నుంచి 10 గంటల మధ్య జరగడంతో ప్రయాణికులు బస్సులు లేక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే దెబ్బతిన్న రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకోకుండా స్థానికులు వాహనాల రాకపోకలు జరుగకుండా అడ్డంగా నాపరాళ్లు, ముళ్లకంప ఏర్పాటు చేశారు. అలాగే దీంతో జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఆర్డినరీ సర్వీసులు బైపాస్ మీదుగా వెళ్లేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే పి.సుగుమంచిపల్లి, దేవగుడి గ్రామాల ప్రజలకు బస్సులు లేక అసౌకర్యం ఏర్పడింది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి జమ్మలమడుగు-ప్రొద్దుటూరు మార్గంలో ప్రధాన రోడ్డుపై పడిన గొయ్యిని తక్షణం పూడ్చించి వాహనాల రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో సోమవారం పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకుడు ఏవీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు వ్యవసాయ అధికారి నరైడ్డి శ్రీకాంత్‌రెడ్డిలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముద్దనూరు రోడ్డులోని ఎరువుల దుకాణాలు తనిఖీలు చేసి అక్కడున్న రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా ఉన్నాయా లేదా పరిశీలించి రికార్డు ప్రకారం ఉన్న స్టాకు విలువను కూడా పరిశీలించారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని ప్రతి రైతుకు నిబంధనల ప్రకారం తీసుకున్న మందులకు రశీదు ఇవ్వాలని వారు ఎరువుల దుకాణాల డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడులో: రసాయనిక ఎరువులను ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమలాపురం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారెడ్డి హెచ్చరించారు. చాపాడులోని ఎరువుల దుకాణాలను సోమవారం నరసింహారెడ్డి, ఏవో దేవీ పద్మలత తనిఖీ చేశారు. రసాయనిక ఎరువుల నిలువలు, ధరలు తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయన డీలర్లకు సూచనలు ఇచ్చారు.

ఎస్ఐకి ఘనసన్మానం



కలసపాడు,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలసపాడు నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సుభాన్‌ను సోమవారం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లెస్వామి రంగారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు చిన్నరంగారెడ్డిలు సన్మానించారు. వారితో పాటు పలువురు టీడీపీ కార్యకర్తలు శాలువ, పూలమాలలతో సన్మానించారు.

కమిటీల నియామకం

దువ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ గ్రామ పంచాయతీ కమిటీల నియామకం కొనసాగుతున్నట్లు ఆ పార్టీ మండల నాయకుడు నారుపల్లె అంకిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు సుబ్బగాళ్ల నరసింహులును టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, పరామర్శించారు. బాధితుడికి భూపేశ్‌రెడ్డి ఆర్థికసాయం అందించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. నరసింహులు రోడ్డుప్రమాదంలో గాయపడి క్యాంబెల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd Jammalamadugu Branch issues the following notice to the general public. My client intend to grant loan to **Turakapalle Zubeda** W/o Thuvvapalle Ameer Basha residing at D.No: 20/326-A, Modampalli Street, Proddatur Mandal, YSR Kadapa Dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice, otherwise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES :** YSR Kadapa Dt. Proddatur R.D, Proddatur Sub-dist. Proddatur Mandal and Thallamapuram panchayath, Thallamapuram Village fiels Residential Vacant Site situated at Sy.No. 138, Plot No. 128, Sai Sri Datta Nagar to an extent of 4.00 Cents or 193.9 Sq. Yards within the following **BOUNDARIES:** EAST: Plot No.81, WEST : 26 Feets Wide Joint Road, NORTH: Plot No.129 of Tappa Sarwarjaha, SOUTH : Plot No.127

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

కూరగాయల మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాలి



మార్కెట్‌లో అపరిశుభ్రత ను పరిశీలించిన కమిషనర్ తదితరులు

ప్రొద్దుటూరు , డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. సోమవారం కమిషనర్ రవిచంద్రారెడ్డి ఈఈ శ్రీనివాసులు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగరాజులు మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ పరిసరాల్లో నీళ్లు నిలబడి అపరిశుభ్రంగా ఉండడం పై శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడును పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని తెలిపారు. అలాగే మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూలుక్రీడా మైదానంలోని జిమ్‌లను పరిశీలించి అక్కడ వసతుల పై ఆరా తీశారు. ఫెన్సింగ్ పడిపోవడం జిమ్ పరికరాలు పాడైపోవడం కమిషనర్ దృష్టికి తెచ్చారు.

నీట మునిగిన పంటలకు పరిహారమివ్వండి

బద్వేలు, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పోరుమామిళ్ల మండల పరిధిలోని గ్రామాలలో నీట మునిగిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సోమవారం ఆర్డీవోకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ టేకూరు పేట, తోకలపల్లె గ్రామస్థులు ఎరసాల, తిమ్మారెడ్డిపల్లె, దాసరిపల్లె, కల్వకుంట్ల, తదితర గ్రామాల రైతులు 1200 ఎకరాల పంటలు సాగుచేశారని ప్రతి ఏటా బ్రహ్మంసాగర్ నీళ్లు బద్వేలు చెరువుకు నింపే క్రమంలో పోరుమామిళ్ల పెద్ద చెరువు కింద 9 గ్రామాలు 12వేల ఎకరాలు ఉన్న చిన్నకారు రైతుల భూములు నీళ్లలో మునిగిపోయాయని, తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, చెర్లోపల్లె మునకవాసుల కన్వీనర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎర్రగుంట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మండల పరిధిలోని తిప్పలూరులో బారీ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జ్యోష్న, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డిలు ప్రసంగిస్తూ ఉచిత వైద్య శిబిరాలతోపాటు ఉచితంగా గళ్ల, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా గళ్లపరీక్ష, ఎక్స్‌రేలు తీస్తున్నట్లు తెలిపారు. 85మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలని వినతి

దువ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపంట సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సోమవారం తహసీల్దారు సంజీవరెడ్డికి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జిల్లా రైతు సేవా సమితి నేత వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీఆర్పీలు, గ్రామ సంఘం అసిస్టెంట్లకు శిక్షణ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన సం స్థ సెర్ప్ ఆధ్వర్యంలో సోమవారం బ్రహ్మంగారిమఠం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మన డబ్బులు, మన లెక్కలు అంశంపై సీఆర్పీలకు, గ్రామ సంఘం అసిస్టెం ట్లకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. స్థానిక వెలుగు ఏపీయం చిన్న ఓబులేసు ఆధ్వర్యంలో ఎల్‌సీ మైదుకూరు క్లస్టర్ శ్రీనివాసులు పర్యవేక్ష ణలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బీఎల్ఓ విధుల నుంచి మినహాయించండి

కలసపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులను బీఎల్ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని యునైటెడ్ వెల్ఫేర్ ప్రభుత్వ ఉద్యోగు సంఘం నేతలు కోరారు. ఆమేరకు సోమవారం తహసీల్దార్ మధురవాణికి ఉద్యోగుల తరపున యునైటెడ్ వెల్ఫేర్ ప్రభుత్వ ఉత్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వరరెడ్డి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఓ విధులు సచివాలయ ఉద్యోగులతో పాటు అర్హతకలిగిన 13రకాల డిపార్ట్‌మెంట్ వారికికూడా కేటాయించాలన్నారు. అలా కాకుంటే డిపార్ట్‌మెంట్ విధుల నుంచి బీఎల్ఓ విధులు నిర్వహించేవారికి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధురవాణి స్పందిస్తూ సచివాలయంలో పనిభారం అధికంగా ఉన్న ఉద్యోగులు మాదృష్టికి సమసలు తీసుకు వస్తే విచారించి అలాంటి వారికి బీఎల్ఓ విధుల నుంచి తప్పించి ఇతరులను నియమిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కాకతీయ కమ్మ నిత్యాన్నదాన సత్రం కమిటీఎన్నిక



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శ్రీ కాకతీయ కమ్మ నిత్యాన్నదాన సత్రం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక శ్రీ కాకతీయ కమ్మ నిత్యాన్నదాన సత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా గుంటూరు పట్టణం ఏటూరు రోడ్డు, డీఎస్ నగర్ వాస్తవ్యులు గద్దె కాశయ్య, ఉపాధ్యక్షుడిగా పల్నాడు జిల్లా నూజండ్ల మండలం జంగాలపల్లె వాస్తవ్యులు నరిశేటి చిన్న హనుమయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శిగా నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామ వాస్తవ్యులు బత్తినేని వెంకటేశ్వర్‌రావు సహాయ కార్యదర్శిగా ప్రకాశం జిల్లా దర్శి మండలం శామంతపూడి గ్రామ వాస్తవ్యులు గూడె వీరబ్రహ్మం, కోశాధికారిగా ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం పెద్ద ఉర్లగల్లు గ్రామ వాస్తవ్యులు ముప్పరాజు సుబ్బారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గద్దె కాశయ్య, ఉపాధ్యక్షుడు నరిశేటి చిన్నహనుమయ్యలు మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని కమ్మ సోదరులు మమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ముందుగా ధన్యవాదాలు తలిపారు. రాబోవు రోజుల్లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ కాకతీయ కమ్మ నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ సోదరులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనం వినియోగంలోకి తీసుకురావాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు, డిసెంబర్ 8, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబాసాహెబ్ అంబేడ్కర్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సోమవారం దళిత ప్రజాసంఘా నాయకులు కోరారు. ఆమేరకు ఆర్డీవోకు వారొక వినతిపత్రం అందజేశారు. భవనం పూర్తి అయ్యి దాదాపు 15 సంవత్సరాలు అవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదని, దీనిని ప్రారంభించకపోవడంవలన అక్కడ సామాజిక కార్యక్రమాలు, సభలు నిర్వహించుకునేందుకు వీలులేకుండా పోయిందన్నారు. అలాగే అక్కడ సిమెంటు రోడ్డు వసతి కల్పించాలని కోరగా అందుకు ఆర్డీవో సానుకూలంగా స్పందించి పై అధికారులతో మాట్లాడి ప్రారంభానికి చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు ముండ్లపాటి పిచ్చయ్య, వెంకటరమణ, రమణ, యోనా ప్రసన్న, చిన్నయ్య, నరసింహులు తదితరులు ఉన్నారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సహకార బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ముద్దనూరు డిసెంబర్8(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సహకార బ్యాంక్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. స్థానిక సహకార బ్యాంక్ ఎదుట సోమవారం సహకార సంఘం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని ఇచ్చిన జీవో నంబర్ 36 ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దనూరు, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

పోరుమామిళలో: సహకార సంఘం ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని పోరుమామిళ్ల సహకార సంఘం కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సోమవారం పోరుమామిళ్లలోని సహకార సంఘం కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని చెబుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు జీవో నెం.36ను వెంటనే అమలు చేసి 2019-24 పెండింగులో ఉన్న వేతన సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చలి నుంచి రక్షణ పొందడానికి దివ్యాంగులకు ఉచితంగా దుప్పట్లను అందజేశారు. సోమవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లను అందజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ దివ్యాంగులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గౌస్‌పీర్, హనుమంతు, సావిత్రి, క్రిష్ణవేణి, మాబూ, అంజలి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్ మహిళలకు వజ్రాయుధం

బద్వేలుటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు బ్రహ్మాస్త్రం శక్తియాప్ వజ్రాయుధం లాంటిదని బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పెషల్ క్యాంపులో భాగంగా 4వ రోజు తెలుగుగంగ కాలనీలో శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి. కవిత మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు, యువతులు, విద్యార్థినులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఈ శక్తి యాప్ సహాయంతో సూక్ష్మంగా బయటపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, వలంటీర్లు, విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్ , డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్ష కోసం జేవీవీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు సోమవారం ఉచితంగా సైకాలజీ మెటీరియల్‌ను అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సహకారంతో రూపొందించిన మెటీరియల్‌ను అభ్యర్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సైకాలజీ అధ్యాపకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రశ్నాపత్రం అప్లికేషన్ ఓరియంటేడ్ విధానంలో వస్తోందని, డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులు సైకాలజీ సబ్జెక్టు కాన్సెప్ట్‌ను పూర్తిగా అవగాహన చేసుకుని చదవాలని సూచించారు. . జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, నాయకులు రాజేష్, కల్యాణ్‌క్రిష్ణ, నరసింహులు, సునీత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పెట్రోల్ బంకు లావాదేవీలపై విచారణ

- అధికారుల పర్యవేక్షణా లోపం
- పేరుకున్న ప్రైవేటు ట్రావెల్స్‌ల బకాయిలు
- పట్టించుకోని గత మున్సిపల్ కమిషనర్లు

ప్రొద్దుటూరు , డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపల్ పెట్రోల్ బంకు లావాదేవీలపై మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి విచారణ చేపట్టారు. ఇటీవల మున్సిపల్ పెట్రోల్ బంకు నిర్వహణ ఇన్‌చార్జిగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి వచ్చి పులివెందుల మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లాల్సిఉంది. కానీ పెట్రోల్ బంకు ఏర్పాటు 2021 ఆగస్టులో ఏర్పాటు అయినప్పటి నుంచి జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ మరో సచివాలయ శానిటరీ సెక్రటరీ వరకుమార్‌లు ఇద్దరు షిఫ్టుల వారీగా నిర్వహణ చూసుకుంటున్నారు. పెట్రోల్ బంకు లావాదేవీల్లో ప్రైవేటు ట్రావెల్స్‌కు ఇచ్చిన బకాయిలు పేరుకు పోయాయి. దీంతో పెట్రోల్ వ్యాపార లావాదేవీల్లో ఉన్న బకాయిలు తేల కుండా పెట్రోల్ బంక్ ఇన్‌చార్జి ప్రవీణ్‌ను పదోన్నతిపై బదిలీ వచ్చిన కమిషనర్ రవిచంద్రారెడ్డి రిలీవ్ చేయలేదు. అంతేకాకుండా ట్రావెల్స్ యజమానులను పిలిపించి బకాయిలపై విచారించగా వారంతా వీలైనంత త్వరగా బకాయిలు చెల్లిస్తామని కమిషనర్‌కు హామీ ఇచ్చారు. మున్సిపల్ పెట్రోల్ బంకులో వ్యాపారం పెరగడం కోసం అప్పులు ఇవ్వడం వారు సకాలంలో డబ్బులు కట్టక బకా యిలు పేరుకొని మున్సిపల్ ఆదాయానికి గండి పడే అవకాశం లేకపోలేదు. అందువల్ల కమిషనర్ రవిచంద్రారెడ్డి మున్సిపల్ పెట్రోల్ బంకు లావాదేవీలపై గతంలో పనిచేసిన నలుగురు కమిషనర్‌లు ఏవిధంగా పరిశీలించారు. బకాయిలు ఉన్నా అవి సకాలంలో చెల్లించేలా చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారు అనే కోణంలో విచారించి మున్సిపల్ ఆర్‌డీకి నివేదించారు. దీనిపై కమిషనర్ రవిచంద్రారెడ్డిని వివరణ కోరగా పెట్రోల్ బంకు లావాదేవీలు పరిశీలించాల్సి ఉండగ పెట్రోల్ బంకు ఇన్‌చార్జిగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కు పదోన్నతిపై బదిలీ అయిన రిలీవ్ చేయడం ఆలస్యమ వుతున్నదన్నారు. పెట్రోల్ బంకు వ్యాపారంలో నెలకొన్న బకాయిల చెల్లింపులపై చర్చించామని లావాదేవీలు పారదర్శకంగా ఉన్నా ఆడిట్ చేపట్టాల్సి ఉందన్నారు.

మత్స్యశాఖ చైర్మన్ రాంప్రసాద్‌కు సన్మానం



జమ్మలమడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మత్స్యసహకార సంఘాల సమాఖ్య చైర్మన్ యాటగిరి రాంప్రసాద్‌ను సోమవారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు లోకేశ్ పార్టీకి సేవ చేయడం వలన కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా బాధ్యతగా పదవి ఇచ్చారన్నారు. మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేస్తానని చైర్మన్ రాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘాల డైరెక్టర్లు బెస్త శ్రీనివాసులు, సంజీవరాయుడు, బాలుడు, సురేష్, వెంకటేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు సహకారమివ్వాలి



భవిత కేంద్ర అధ్యాపకులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల భవిష్యత్ వారి అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతోపాటు ప్రతి ఒక్కరి తోడ్పాటు అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని భవిత కేంద్రంలో ఘనంగా ప్రతిభావంతుల దినోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా గడియారం శేషశర్మ దంపతులు సేవా భావంతో విద్యాబుద్ధులు, క్రమశిక్షణ నేర్పుతున్న అధ్యాపకురాలు సంగీతను శాలువా కప్పి సత్కరించారు. రిటైర్డు ఎంఈవో శశిశర్మ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. సాయిసుధ దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్‌బోర్డు కాలనీ ఎంపీపీఎస్ పాఠశాల హెడ్మాస్టర్ గురివిరెడ్డి, ఫిజియోథెరపిస్టు ఉస్మాన్ అలీ, భవిత కేంద్ర ఉపాధ్యాయుడు లక్ష్మిరెడ్డి, కేశవరెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగుల స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకోండి



ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు, దివ్యాంగులు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చెందిన స్థలాలను ఆక్రమించే ప్రయత్నం చేసిన భూకబ్జాదారులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జి.సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద జిల్లా కార్యవర్గ సభ్యుడు శివకుమార్, సీపీఎం కార్యకర్తలతో కలిసి తహసీల్దరు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా కార్యదర్శి జి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ 1428 సర్వేనంబరులో 15 ఏళ్ల క్రితం దివ్యాంగులకు పట్టాలు మంజూరు చేశారని, అయితే కొంత మంది భూకబ్జాదారులు వాటని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఆమేరకు డిప్యూటీ తహసీల్దారు జాన్సన్‌కు వినతిపత్రం అందించగా భూకబ్జాదారులపై చర్యలు తీసుకుని మీ ఇళ్ల స్థలాలు మీకిప్పిస్తామని డీటీ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

దైవ మార్గాన్ని విడనాడొద్దు : బిషప్



అమగంపల్లెలో అమలోద్భావి మాత స్వరూపాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కాశినాయన డిశంబరు8 (ఆంధ్రజ్యోతి) దైవ మార్గాన్ని విడనాడవద్దని కడప బిషప్ హౌస్ ఛాన్సలర్ లక్కినేని ఆరోగ్యరాజు, పోరుమామిళ్ళ డీన్ విజయభాస్కర్, అమగంపల్లె విచారణ గురువు సగిలి థామస్ పేర్కొన్నారు. కాశినాయన మండలంలోని అమగంపల్లె గ్రామంలో సోమవారం అమలోద్భావి మాత గుడితిరుణాల ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దాదాపు 70 సవత్సరాల క్రితం నిర్మించిన అమలోద్భావి మాత చర్చిలో 15 మంది గురువులు,10 మంది సిస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అమలోద్భావి మాత స్వరూపం అమగంపల్లె పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.ఫాదర్ అరుణకుమార్‌చే స్వస్థతాప్రార్థనలు నిర్వహించారు. ఈపండుగను పురష్కరించుకొని అమగంపల్లె, మల్లెపల్లెకు చెందిన ప్రభాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డిలు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చుటుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్యపరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య బృందం

కలసపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పద్మావతి మహిళా మండలి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 25 మంది వృద్ధులకు వైద్యపరీక్షలు చేసిమందులు అందజేశారు. కంటి వైద్య నిపుణులు గౌరీప్రి య, జనరల్ మెడిసిన్ నాగయ్య, దంత వైద్యులు కళ్యాణచక్రవర్తి, చెవి, ముక్కు, గొంతు వైద్యులు మునిమహేష్‌బాబు పాల్గొని చికిత్సలు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ శైలజ తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ సూపరింటెండెంట్ వెంకటరెడ్డి, ల్యాబ్‌టెక్నీషియన్ స్వాతి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, సీహెచ్ఓ నవీన్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, స్వాతి, హేమ, ఏఎన్ఎమ్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

